
సాక్షి
తిరుపతి
సోమవారం, 12, జూన్, 2023



సాధనతోనే విజయం సాధ్యం

సాధనతోనే విజయం వరిస్తుందని సాక్షి మీడియా, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ నిర్వహించిన సదస్సులో వక్తలు పేర్కొన్నారు. - 8లో



వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు

రేణిగుంటకు చెందిన టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీలో ఆదివారం చేరారు. ఎమ్మెల్సీ సుబ్రమణ్యం, పవిత్రారెడ్డి ఆహ్వానించారు. -8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	40	28
చిత్తూరు	38	27
తిరుమల	34	23
గూడూరు	42	30
నగరి	41	28

న్యూస్‌రీల్

పండుగలా 'కానుక' పంపిణీ

తిరుపతి అర్బన్ : పండుగ వాతావరణంలో జగనన్న విద్యాకానుక కిట్‌లను విద్యార్థులకు పంపిణీ చేయాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న తొలిరోజునే కిట్‌లు అందజేయాలని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రస్థాయి కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. అదే సమయంలో స్థానిక ప్రజాప్రతినిధుల చేతులమీదుగా పిల్లలకు విద్యాకానుక అందించాలని సూచించారు. కార్యక్రమానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు.

హోమశాల ఆధునికీకరణ




స్థలాన్ని పరిశీలిస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో చండీ, రుద్ర హోమాలు నిర్వహించే మండపం ఆధునికీరణ పనులను ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దక్షిణ గోపురం సమీపంలోని కాళికాదేవి ఆలయంలో హోమాలు నిర్వహిస్తున్నామని, ఆ ప్రాంతం ఇరుకుగా 10 మంది భక్తులు కూడా కూర్చునేందుకు ఇబ్బంది పడేవారన్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.18లక్షలతో మండపాన్ని విశాలంగా నిర్మించనున్నట్లు వెల్లడించారు. కనీసం 50 జంటలు కూర్చుని హోమ పూజల్లో పాల్గొనే విధంగా తీర్చిదిద్దనున్నట్లు వివరించారు. 25రోజుల లోపు పనులు పూర్తిచేసి హోమశాలను అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అర్జీలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. వినతులు రాసేందుకు ప్రత్యేకంగా ముగ్గురు వీఆర్‌ఓలను నియమించినట్లు వివరించారు. స్పందనకు అన్నిశాఖ జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని ఆదేశించారు. ప్రతి అర్జీకి ప్రాధాన్యమివ్వాలని, అందులో పేర్కొన్న సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కమిటీలు



మాట్లాడుతున్న ఈఈ వాసురెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్) : గ్రామీణ ప్రాంతాల్లోని సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులతో కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీడీసీఎల్ తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి తెలిపారు. ఆదివారం చంద్రగిరి సబ్‌స్టేషన్ వద్ద ఆయన మాట్లాడుతూ మెరుగైన విద్యుత్ సరఫరాకు కమిటీలు ఉపయోగపడతాయన్నారు. వ్యవసాయానికి పగటిపూట 9గంటలు విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. ఇళ్లు, పరిశ్రమలకు 24 గంటలపాటు కరెంట్ సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. లోఓల్టేజ్ నివారణకు చంద్రగిరి జగనన్న కాలనీలో రూ.2.5కోట్లతో నూతన సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నట్లు వివరించారు. విద్యుత్ సమస్యలపై వినియోగదారులు టోల్‌ఫ్రీ నంబర్ 1913 కాల్ చేయాలని సూచించారు. సమావేశంలో చంద్రగిరి డీఈ శేషాద్రిరెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దార్లుగా ఉద్యోగోన్నతి

చిత్తూరు కలెక్టరేట్:ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో పలువురు డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని ఏ శ్రీనివాసులు సత్యసాయి జిల్లాకి, కే.అమర్‌నాథ్ తిరుపతికి, శివరామసుబ్బయ్యను వైఎస్‌ఆర్ జిల్లా నుంచి తిరుపతికి, జనార్దనమ్ చిత్తూరు నుంచి తిరుపతికి, నరసింహులు చిత్తూరుకు, కృష్ణను చిత్తూరు నుంచి తిరుపతికి, ఝాన్సిలక్ష్మీని చిత్తూరుకు, జయప్రకాష్‌ను చిత్తూరుకు, హమీద్‌బాషాను చిత్తూరు నుంచి సత్యసాయి జిల్లాకు కేటాయించారు. అలాగే భగవతిని చిత్తూరుకు, మురళీమోహన్‌ను చిత్తూరుకు, శేషగిరి రావును చిత్తూరు నుంచి తిరుపతి జిల్లాకు కేటాయించారు. కుమారస్వామిని చిత్తూరుకు,గుణశేఖర్‌రెడ్డిని చిత్తూరుకు, మురాషావళిని చిత్తూరు నుంచి సత్యసాయి, జనార్దన్‌రాజును వైఎస్‌ఆర్ కడప జిల్లా నుంచి తిరుపతికి, లక్ష్మీనారాయణను చిత్తూరుకు, రవికుమార్‌ను చిత్తూరు జిల్లాకు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు.

బడికి వేళాయె..

నాడు: గతంలో నూతన విద్యాసంవత్సరంలో పాఠశాలలు సమస్యలతో స్వాగతం పలికేవి. తరగతి గదుల కొరత, సబ్జెక్టు టీచర్లు లేకపోవడం మరుగుదొడ్లు, తాగునీటి సమస్యలు తదితర సమస్యలు ఉండేవి. టీడీపీ పరిపాలనలో సర్కారు బడులను అభివృద్ధి చేయకపోవడంతో తల్లిదండ్రులు గత్యంతరం లేక ప్రైవేట్ బడులకు పిల్లలను పంపేవారు. పుస్తకాలు, షూలు, బ్యాగులు, దుస్తుల కొనుగోలుకు సామాన్యులు అప్పులు చేసేవారు.

నేడు: ప్రస్తుతం ట్రెండ్ మారింది. గతంలో ఎన్నడూ లేని విధంగా సర్కారు బడులు సర్వాంగ సుందరంగా తయారయ్యాయి. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం నాడు-నేడు కింద రూ. వేలాది కోట్లతో కార్పొరేట్‌ను తలదన్నేలా సర్కారు బడులను తయారు చేసింది. అమ్మఒడితో పాటు పాఠశాలల పునఃప్రారంభ రోజునే జగనన్న విద్యాకానుక కింద 9 రకాల కిట్లను అందజేస్తుండడంతో తల్లిదండ్రులు సంతోషంగా తమ పిల్లలను సర్కారు బడులకు పంపుతున్నారు.



బడిగంట



డెస్కులను శుభ్రం చేస్తున్న సిబ్బంది

ఆటపాటలతో వేసవి సెలవుల్లో సేదతీరిన విద్యార్థులు నేటి నుంచి ఉత్సాహంగా బడిమెట్లు ఎక్కనున్నారు. 2022-23 విద్యాసంవత్సరం జూన్ 11 తో ముగిసింది. 2023-24 విద్యాసంవత్సరం జూన్ 12 వ తేదీతో ప్రారంభం కానుంది. వేసవి సెలవుల్లో ఇప్పటి వరకు ఇంటిపట్టునే ఉన్న విద్యార్థులు...పుస్తకాల బ్యాగులతో నేటి నుంచి బడిబాట పట్టనున్నారు. సోమవారం బడులు పున:ప్రారంభం అవుతున్న సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం..

- నేటి నుంచి పాఠశాలల పున: ప్రారంభం
- ఏర్పాట్లు సిద్ధం చేసిన విద్యాశాఖ అధికారులు
- నేడు జగనన్న విద్యాకానుక పథకం ప్రారంభం
- వేసవి దృష్ట్యా ఈనెల 17 వరకు ఒంటి పూటబడులు

చిత్తూరు కలెక్టరేట్ : వేసవి సెలవుల అనంతరం సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు తిరిగి తెరుచుకోనున్నాయి. కొత్త ఆశలు, సరికొత్త ఆలోచనలతో నూతన విద్యా సంవత్సరంలోకి విద్యార్థులు అడుగుపెట్టనున్నారు. అందంగా ముస్తాబైన పాఠశాలలు పిల్లలకు స్వాగతం పలకనున్నాయి. జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలో 2,542 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 1,73,071 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరంతా ఈ విద్యాసంవత్సరం బడులకు రానుండగా, కొత్త అడ్మిషన్‌లు సైతం కానున్నాయి. విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించారు. పాఠశాలల ప్రాంగణాల్లో చెత్త చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టారు. నాడు-నేడు పనులు నిర్వహిస్తున్న పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని డీఈవో క్షేత్రస్థాయి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.



పంపిణీకి సిద్ధంగా యూనిఫామ్



జగనన్న విద్యాకానుక కిట్‌లు

తిరుపతి జిల్లా పరిధిలోని అన్ని యాజమాన్య పాఠశాలలు

పాఠశాల రకం	పాఠశాల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
శాటిలైట్ స్కూల్స్ (పీపీ-1, పీపీ-11)	199	-
ఫౌండేషన్ స్కూల్స్ (పీపీ-1, పీపీ-11, 1, 2)	235	5,193
ఫౌండేషన్ ప్లస్ స్కూల్స్ (పీపీ-1, పీపీ-11, 1-5)	1620	55,126
ప్రీ హైస్కూల్స్ (3-7/8)	164	15,860
హైస్కూల్స్ (3-10/6-10)	294	82,443
హైప్లస్ (3-12/6-12)	30	14,449
మొత్తం	2,542	1,73,071



తొలిరోజే జగనన్న విద్యాకానుక కిట్లు

జిల్లా వ్యాప్తంగా అన్ని సర్కారు బడుల్లో జగనన్న విద్యాకానుక కిట్లను తొలిరోజే పంపిణీ చేయనున్నారు. ఆయా పాఠశాలల స్థాయిలో స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించి జగనన్న విద్యాకానుక కిట్లను సోమవారం విద్యార్థులకు అందించనున్నారు. ఆ కిట్లల్లోనే పాఠ్యపుస్తకాలతో పాటు, విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రిని ప్రభుత్వం అందజేయనుంది.

మధ్యాహ్నం తరగతులు నిర్వహిస్తే చర్యలు

అధికంగా ఎండలు ఉండడం వల్ల విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం ఒంటి పూట బడులకు అనుమతిచ్చింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు ఈనెల 12 నుంచి ఈ నెల 17 వ తేదీ వరకు ఒంటిపూట బడులు నిర్వహించాలని, ప్రైవేట్ యాజమాన్యాలు సైతం నిబంధనలను పాటించాలని డీఈవో శేఖర్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ మధ్యాహ్నం తరగతులు నిర్వహిస్తే అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకే బడులు నిర్వహించాలని ఆదేశించారు.

ప్రతి విద్యార్థికీ కిట్



సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం మౌలిక వసతులను కల్పించింది. విద్యార్థులకు జేవీకే కిట్లను మొదటి రోజే అందజేయనున్నారు. పకడ్బందీగా నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశాం. ఎక్కడైనా పొరబాట్లు జరిగే చర్యలు తప్పవు. ప్రతి విద్యార్థికి కిట్లు అందాలి.

– వెంకటరమణారెడ్డి, కలెక్టర్, తిరుపతి

వందశాతం ఎన్‌రోల్‌మెంటే లక్ష్యం



2023-24 విద్యా సంవత్సరం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. వందశాతం ఎన్‌రోల్‌మెంట్ లక్ష్యంగా సర్కారు బడుల్లో నాణ్యమైన గుణాత్మక విద్య అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ఉపాధ్యాయులు సకాలంలో విధులకు వెళ్లి జేవీకే కార్యక్రమంలో పాల్గొనాలి. పండుగ వాతావరణంలో ప్రజాప్రతినిధులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించి కార్యక్రమం ఘనంగా నిర్వహించాలి.

– డాక్టర్ వి.శేఖర్, జిల్లా విద్యాశాఖాధికారి, తిరుపతి

బడులకు కొత్త అయ్యోర్లు

టీచర్ల కోరిక మేరకు రాష్ట్ర ప్రభుత్వం వేసవి సెలవుల్లో బదిలీలను నిర్వహించింది. ఆ ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. కచ్చితంగా బదిలీ కావాల్సిన వారు 4072 మంది, రిక్వెస్ట్ బదిలీలకు 4,904 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారందరికీ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆన్‌లైన్‌లో బదిలీ ఉత్తర్వులు పంపింది. వాటిని స్వీకరించిన అయ్యోర్లు బదిలీ అయిన నూతన పాఠశాలల్లో చేరారు. నూతన విద్యాసంవత్సరంలో పలు సర్కారు బడుల్లో కొత్త అయ్యోర్లు పాఠాలు బోధించనున్నారు.

ప్రాణాలు తీసిన షార్ట్‌కట్

- అంజేరమ్మ కనుమ వద్ద ఘోర ప్రమాదం
- టెంపోను ఢీకొట్టిన పాల వ్యాను
- ఐదుగురి మృతి
- ఎనిమిది మందికి గాయాలు

వడమాలపేట: రియల్ ఎస్టేట్ యజమాని ఆహ్వానం .. ఎక్కడెక్కడో ఉన్న ఉద్యోగులందరూ కలిసి ఒక్కటిగా ప్రయాణం.. మదిలో అమ్మవారి దర్శనం.. ఆపై విందు భోజనం.. ఇలా ఎన్నో ఊహలు, ఊసులతో సాగిన ప్రయాణం ఆ కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చింది. గుడికి త్వరగా వెళ్లేందుకు టెంపో డ్రైవర్ షార్ట్‌కట్‌ను వెదకడం.. ఆపై రాంగ్ రూట్‌లో వెళ్లడం.. ఎదురుగా వస్తున్న పాల ట్యాంకర్ ఢీకొట్టడం క్షణాల్లో జరిగిపోయింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతిచెందగా.. మరో ఎనిమిది మంది తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు.




వాహనంలో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీస్తున్న 108 సిబ్బంది, స్థానికులు

అసలేం జరిగిందంటే

తిరుపతి ఎస్‌ఆర్ ఇండియా ప్రైమ్ ప్రాపర్టీస్ నిర్వాహకులు వడమాలపేట మండలం, ఎస్వీపురం పంచాయతీలోని అంజేరమ్మకు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించాలని భావించారు. బంధుమిత్రులు, సిబ్బందిని విందు భోజనానికి ఆహ్వానించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 13 మందితో ఆదివారం మధ్యాహ్నం టెంపోలో బయలుదేరి, ఎస్వీపురం టోల్ ప్లాజా దాటారు. తర్వాత అంజేరమ్మ ఆలయానికి త్వరగా వెళ్లడానికి టెంపో డ్రైవర్ షార్ట్‌కట్‌లో ఉన్న రాంగ్‌రూట్‌ను ఎంచుకున్నాడు. కొంత దూరం వెళ్లాక ఎదురుగా వస్తున్న మిల్క్ వ్యాన్ ఢీకొట్టడంతో టెంపోలో ప్రయాణిస్తున్న రేవంత్(44), గిరిజ (45), శివకుమార్ (57), రేఖ(24), అజయ్‌కుమార్ అలియాస్ అంజి(25) మృతిచెందారు.

యమడేంజర్

అంజేరమ్మ కనుమ ప్రమాదకరమైంది. ఇక్కడ గుట్టపై వెలసిన అంజేరమ్మ ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేస్తుంటారు. ఆది, మంగళ, శుక్రవారాల్లో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. జంతుబలులిచ్చి, పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తుంటారు. ఈనేపథ్యంలో కొత్తగా వచ్చేవారు ఎలా వెళ్లాలో తెలియక తికమక పడుతుంటారు. కొందరు రాంగ్‌రూట్‌లో వెళ్లి ప్రమాదాల బారిన పడుతుంటారు. రద్దీగా ఉండే ఈ మార్గంలో ఎలాంటి స్పీడ్ బ్రేకర్లు కూడా లేవు. హైవే అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయని స్థానికులు చెబుతున్నారు.





గాయపడిన నరసింహులు, ఆంజనేయులు

ఈ ఏడాదిలోనే 8 మంది మృతి

ఈ ఏడాదిలోనే అంజేరమ్మ కనుమ వద్ద 8 మంది మృతిచెందారు. 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. 2023 ఫిబ్రవరిలో స్కూటర్‌పై వెళ్తున్న చెన్నైకి చెందిన ఇద్దరు యువ లాయర్లు దుర్మరణం పాలయ్యారు. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. ఇటీవల రెండు స్కూటర్లు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. ముగ్గురు గాయపడ్డారు. తాజాగా ఆదివారం జరిగిన ప్రమాదంలో ఐదుగురు మృతిచెందగా.. మరో ఎనిమిమందికి గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

మేఘమై నేను వచ్చాను!



ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఆకాశం మేఘావృతమైంది. నైరుతి రాకతో కారు మబ్బులతో నిండిపోయింది. భానుడి కిరణాల మాటున వెండి మబ్బుల వలే కనువిందు చేయడం.. ఆ సుందర దృశ్యాలు పలువురు సెల్‌ఫోన్లలో బంధించడం కనిపించింది. ఇన్నాళ్లూ ఉక్కపోత, ఎండ వేడిమితో అల్లాడిన జనానికి కాస్త ఉపశమనం కలిగింది. వాన చినుకుల కోసం ఆత్రుతగా ఆకాశం వైపు చూడడం అన్నదాత వంతైంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ప్రజాసంక్షేమానికే ప్రాధాన్యం

- ప్రతి సచివాలయానికి అదనంగా రూ.20లక్షలు
- ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

పాకాల: ప్రజాసంక్షేమానికే తొలి ప్రాధాన్యమిస్తున్నామని, చంద్రగిరి నియోజకవర్గవాసులను కుటుంబసభ్యులుగానే భావిస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని బైనపల్లెలో వైఎస్సార్‌సీపీ నేత చిటిపిరాళ్ల చెన్నకేశవరెడ్డి నివాసం వద్ద పార్టీ నేతలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం నుంచి చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గడపగడపకు పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. ప్రతీ ఇంటికి మోహిత్‌రెడ్డిని పరిచయం చేయాలని సూచించారు. ఇప్పటికే ప్రతీ పంచాయతీకి రూ.2 కోట్లకు పైగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు పూర్తిచేశామని వెల్లడించారు. ముఖ్యమంత్రి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, తుడా నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులతో ప్రజల్లోకి ధైర్యంగా వెళ్లగలిగే సామర్థ్యం మనకు మాత్రమే ఉందని తెలిపారు. ప్రజల్లో ఉన్న వ్యక్తులే నాయకులవుతారని, ప్రతి పంచాయతీలో పాదయాత్రను విజయవంతం చేయాలన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ పెళ్లి జరిగినా సొంత నిధులతో పెళ్లి కానుకను అందజేస్తున్నామని చెప్పారు. కులమతాలకు అతీతంగా ప్రజలందరినీ గౌరవిస్తున్నామని, అందుకే మనల్ని ఎవరూ మరచిపోరని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరితో మాట్లాడి తాము చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని కోరారు. ప్రభుత్వం ప్రతి సచివాలయ పరిధిలో అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు మంజూరు చేసిందని, మోహిత్‌రెడ్డి అభ్యర్థన మేరకు మరో రూ.20లక్షలను అదనంగా అందజేస్తున్నట్లు వెల్లడించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి

రూ.5 లక్షల చెక్కు పంపిణీ

వైఎస్సార్‌సీపీ స్థానిక నేత కత్తి ఉమాకాంత్‌రెడ్డి ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. ఈ క్రమంలో వారి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే చెవిరెడ్డి పరామర్శించారు. సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైన రూ.5లక్షల చెక్కును ఉమాకాంత్‌రెడ్డి తల్లిదండ్రులు జయంతి, చెంగల్‌రెడ్డికి అందజేశారు. ఉమాకాంత్ సేవలను మరువలేమని, వృద్ధ దంపతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నేత, నేండ్రగుంట డివిజన్ అధ్యక్షుడు గుండ్లూరి సురేష్ తల్లి అంజలమ్మ కర్మక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఉన్నారు.

సాధనతోనే విజయం సాధ్యం



సదస్సులో మాట్లాడుతున్న అధ్యాపకుడు కృష్ణారెడ్డి



విజేతలకు నగదు, స్టడీ మెటీరియల్ అందజేస్తున్న అతిథులు

- సృజనాత్మకత.. అభ్యసనతో పోటీ పరీక్షల్లో రాణింపు
- అభ్యర్థులు ఆర్‌సీ ఎగ్జామ్స్ వంటి ఉత్తమ కోచింగ్ సెంటర్లు ఎంచుకోవాలి
- అవగాహన సదస్సులో వక్తలు

తిరుపతి కల్చరల్ : సాధనతోనే పోటీ పరీక్షల్లో విజయం సాధ్యమని, ఇందులో రాణించాలంటే సృజనాత్మకత.. అభ్యసన అవసరమని పలువురు వక్తలు పిలుపు నిచ్చారు. సాక్షి మీడియా గ్రూపు, హైదరాబాద్ ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి మహతి కళాక్షేత్రంలో గ్రూప్–2 పోటీ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. ఇప్పటికే రాష్ట్రంలో లక్షల సంఖ్యలో ఉద్యోగాలను భర్తీ చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం త్వరలో గ్రూప్ –2 ద్వారా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలను భర్తీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థుల్లో పోటీ పరీక్షలకు తగ్గట్లు నైపుణ్యాలను పెంపొందించేందుకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు నిపుణులైన అధ్యాపకులు డాక్టర్ అబ్దుల్‌కరీం (హిస్టరీ), బి.కృష్ణారెడ్డి (పాలిటీ), ఎండీ పాషా (ఎకనామీ), సి.హరికృష్ణ (సైన్స్ అండ్ టెక్నాలజీ) హాజరై అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. గ్రూప్–1 అధికారులు వెంకటనారాయణ, శ్యామ్ సుందర్, సుధాకర్ తమ అనుభవాలను వివరించి అభ్యర్థుల్లో స్ఫూర్తి నింపారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ చైర్మన్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వివిధ సబ్జెక్టుల్లో నిష్ణాతులైన లెజెండరీ ఫ్యాకల్టీతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్ విధానంలో వేల మంది అభ్యర్థులు తమ వద్ద శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు. సాక్షి బ్రాంచ్ మేనేజర్ సత్యేంద్రబాబు మాట్లాడుతూ పోటీ పరీక్షల అభ్యర్థులకు సాక్షి భవిత, సాక్షి ఎడ్యుకేషన్.కామ్ ద్వారా అద్భుతమైన మెటీరియల్ అందిస్తున్నామన్నారు. అభ్యర్థులు ఇలాంటి అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాక్షి జిల్లా బ్యూరో ఇన్‌చార్జ్ తిరుమల రవిరెడ్డి మాట్లాడుతూ లక్ష్యంతో ముందుకెళుతూ ప్రణాళికబద్ధంగా సాధన చేస్తే విజయం సాధించవచ్చని తెలిపారు. ప్రస్తుత పోటీ పరీక్షల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులను సైతం ఉన్నత శిఖరాలు అధిరోహించి ఉజ్వల భవితకు మార్గనిర్దేశం చేయడమే లక్ష్యంగా గ్రూప్–2 పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించినట్లు వెల్లడించారు. అనంతరం అభ్యర్థులకు నమూనా టాలెంట్ టెస్ట్ నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, స్టడీ మెటీరియల్ అందించారు. తర్వాత స్థానాల్లో నిలిచిన 20 మందికి ప్రామాణిక స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో సాక్షి టీవీ కరస్పాండెంట్ విజయమూర్తి, ఈవెంట్ మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



హాజరైన అభ్యర్థులు

అత్యుత్తమంగా గ్రూప్–2 శిక్షణ అందిస్తున్నాం



పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో రాష్ట్రంలోనే అత్యుత్తమ శిక్షణను ఆర్.సీ.ఎగ్జామ్ సంస్థ ద్వారా అందిస్తున్నాం. రాష్ట్రంలోని అత్యుత్తమ ఫ్యాకల్టీలందరూ మా సంస్థలో బోధన చేస్తున్నారు. వారి సహకారంతో ఈనెల 19 నుంచి ఏపీ గ్రూప్–2 బ్యాచ్‌కు అడ్మిషన్లు ప్రారంభించనున్నాం. హైదరాబాద్ రాలేని ప్రైవేటు ఉద్యోగులు, గృహిణులు, ఇతర విద్యార్థుల కోసం ఎగ్జామ్స్ మొబైల్ యాప్ ద్వారా తెలుగు, ఇంగ్లిష మీడియంలలో శిక్షణ అందిస్తాం. పూర్తి వివరాల కోసం 89850 93399, 89850 94499 నంబర్లను సంప్రదించ వచ్చు.

-మొండెం కిరణ్‌కుమార్, చైర్మన్ ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ, హైదరాబాద్

స్ఫూర్తిని కలిగించారు



అభ్యర్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో స్ఫూర్తిని కలిగించారు. ప్రణాళిక బద్ధమైన సాధన విజయాన్ని సాధిస్తుందని ఉదాహరణలతో చెప్పిన తీరు అద్భుతం. గ్రూప్స్‌నకు సన్నద్ధమవుతున్న నాలాంటి అభ్యర్థులకు ఈ అవగాహన సదస్సు ఒక వరం.

- కె. ఉమ దుశ్యంత్, తిరుపతి

సాధనకు దిక్సూచి



ఉన్నత కొలువులు సాధించాలని సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఇలాంటి అవగాహన సదస్సు ఒక దిక్సూచిలా ఉపకరిస్తుంది. ఇందుకు కృషి చేసిన సాక్షి యాజమాన్యానికి ధన్యవాదాలు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని ఏర్పాటు చేసి నిరుద్యోగుల అభ్యున్నతికి దోహదపడాలి.

- ఎం.నీరజ, అభ్యర్థి

ఆత్మవిశ్వాసం పెంచింది



గ్రూప్–2 పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే అభ్యర్థులు తీసుకోవాల్సిన అంశాలపై నిపుణులైన ఫ్యాకల్టీ అందించిన చక్కటి మార్గనిర్దేశం ఆత్మ విశ్వాసాన్ని పెంచింది. పోటీ పరీక్షలకు తొలిసారిగా పోటీ పడే అభ్యర్థులు సైతం తక్కువ సమయంలో ఎలా విజయం సాధించవచ్చు అనే విష యాలను అర్థమయ్యేలా చక్కగా వివరించారు.

- టి.శరత్, అభ్యర్థి, కదిరి

సాక్షికి కృతజ్ఞతలు



గ్రూప్–2 ఉద్యోగం సాధించాలంటే ఎలాంటి వ్యూహాలను అనుసరించాలో ఈ అవగాహన సదస్సు ద్వారా అవగతమైంది. ఏయే సబ్జెక్టులపై ఎలా ఫోకస్ చేయాలనే అంశాలపై స్పష్టత వచ్చింది. ప్రిలిమినరీ, మెయిన్స్ రెండింటికి ఒకే దఫా ఎలా సన్నద్ధం కావాలనే అంశంపై అంచనా ఏర్పడింది. ఇలాంటి సదస్సు నిర్వహించిన సాక్షి వారికి ప్రత్యేక కృతజ్ఞతలు

- బి.చంద్రనాయక్ అభ్యర్థి

ఉన్నతంగా ప్రిపరేషన్



పోటీపరీక్షలకు ప్రశ్నపత్రం కంటే మన ప్రిపరేషన్ ఉన్నతంగా ఉండాలి. పరీక్షల స్టాండర్డ్ ఎప్పటికప్పుడు పెరుగుతున్న నేపథ్యంలో కఠోర శిక్షణ తప్పనిసరి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో శిక్షణ లభిస్తున్నప్పటికీ ఆన్‌లైన్‌లో పొందే శిక్షణ ద్వారా పోటీతత్వం అవగతమవుతుంది. పోటీ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పక్కవారికంటే ఒక్క మార్కు ఎక్కువ సాధించేలా శ్రమించాలి. ఎప్పటికప్పుడు సబ్జెక్ట్‌ల్లో అప్‌డేట్ కావాలి. నిష్ణాతులైన ఆర్‌సీ ఎగ్జామ్స్ సెంటర్‌లో లెజెండరీ ఫ్యాకల్టీ అందుబాటులో ఉంటారు.

- డాక్టర్ అబ్దుల్ కరీం, హిస్టరీ ఫ్యాకల్టీ

సిలబస్ పూర్తి చేయాలి



పోటీ ప్రపంచంలో సమయం ఎంతో విలువైంది. నోటిఫికేషన్ జారీ చేసే లోపు సిలబస్‌ను పూర్తి చేయడం ద్వారా ప్రిపరేషన్‌లో ముందుండవచ్చు. పోటీ పరీక్షల కోసం నిరుద్యోగ అభ్యర్థులు పెట్టుబడి పెట్టేది కేవలం విలువైన సమయం మాత్రమే. ఎకానమీ సబ్జెక్టు అభ్యర్థుల విజయాన్ని డిసైడ్ చేస్తుంది. సరైన ప్రణాళిక విజయానికి బాటలు వేస్తుంది. ఉద్యోగం సాధించిన తర్వాత వచ్చే హోదా, గుర్తింపు మనలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయి.

- ఎండీ పాషా, ఎకానమీ ఫ్యాకల్టీ

గైడెన్స్‌దే ప్రధాన పాత్ర



అభ్యర్థులు విజయం సాధించేందుకు గైడెన్స్ ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఇతరుల అనుభవాలను తీసుకోవడం ద్వారా విజయం సాధించవచ్చు. గైడెన్స్ గెట్‌విన్. విజేతలతో పాటు పరాజితుల ఇంటర్వ్యూలను ఆదర్శంగా తీసుకోవాలి. ఏమి చేయాలో ... ఏమి చేయకూడదో తెలుసుకుంటే గెలుపు మనదే. ఎక్కువ సార్లు సాధన చేయడమే విజయ రహస్యం. సంక్షిప్తత నుంచి సరళత్వం దిశగా సాధన ఉండాలి. నాణ్యమైన కంటెంట్, సిలబస్‌ను లోతుగా చదవాలి.

- పి.హరికృష్ణ, సైన్స్ అండ్ టెక్నాలజీ ఫ్యాకల్టీ

ఆలోచనే విజయానికి సోపానం



పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ప్రతి అక్షరాన్ని గరిష్ఠంగా ఉపయోగించుకోవాలి. ప్రశ్నలు ఎలా వస్తాయో ఊహించేలా సబ్జెక్టుపై పట్టు సాధించాలి. ఇందుకు తగ్గ విజయ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. వైవిధ్యంగా ఆలోచించడం, సృజనాత్మతకను జోడించడం ద్వారా విజయం సాధ్యమవుతుంది. సబ్జెక్టుపై అవగాహన పొందడం ద్వారా సమగ్రత వస్తుంది. విజయంతో విశ్వాసం పెరుగుతుంది. పాలిటీలో గ్రాఫ్స్, విస్తృతి, అనువర్తిత విషయాలపై దృష్టి సారించాలి.

- బి.కృష్ణారెడ్డి, పాలిటీ ఫ్యాకల్టీ

కూరగాయల లారీ బోల్తా

చిల్లకూరు : మండలంలోని జాతీయ రహదారిపై రైటార్ సత్రం వద్ద కూరగాయల లోడ్‌తో వెళుతున్న ఓ లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. లారీ యజమానులు ఘటనా స్థలానికి చేరుకుని కూరగాయలను మరో లారీలో తరలించారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు



పార్టీలో చేరిన నేతలతో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, బియ్యపు పవిత్రారెడ్డి

రేణిగుంట : పట్టణంలో వన్నెకుల క్షత్రియ సామాజికవర్గానికి చెందిన సుమారు 200 మంది టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో ఆదివారం చేరారు. స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, పార్టీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి సమక్షంలో టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు చంద్రబాబు అలవికాని హామీలను మేనిఫెస్టో పేరుతో విడుదల చేశారన్నారు. ఆయన బూటకపు హామీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. సంక్షేమం.. అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజకంగా పాలన సాగిస్తున్నారని కొనియాడారు. గత టీడీపీ హయాంలో ఆ పార్టీ కార్యకర్తలకే ప్రభుత్వ పథకాలు అందేవని, ఇప్పుడు జగనన్న పాలనలో పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వెల్లడించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ప్రజాసేవే పరమావధిగా సాగుతున్నారని తెలిపారు. నిత్యం జనం మధ్యనే ఉంటూ, వారికి ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వివరించారు. టీడీపీతో బీసీలకు ఒరిగింది శూన్యమని, జగనన్నతోనే బీసీ సంక్షేమ సాధ్యమని వెల్లడించారు. బియ్యపు పవిత్రారెడ్డి మాట్లాడుతూ 2019 సార్వత్రిక ఎన్నికల్లో తన తండ్రి బియ్యపు మధుసూదన్‌రెడ్డికి రేణిగుంట మండల ప్రజలు అత్యధిక మెజారిటీ అందించాని గుర్తుచేశారు. స్థానిక పేదలకు ఇంటి స్థలాల పంపిణీలో కొన్ని సమస్యలు తలెత్తాయని, వాటిని పరిష్కరించిన తర్వాతే ఓట్లు అడుగుతామని స్పష్టం చేశారు. తుడా నిధులతో త్వరలోనే మంచినీళ్ల గుంట అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో రేణిగుంట గంగమ్మ ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సోలా మల్లికార్జునరెడ్డి, వసంతమ్మ, రుక్మిణి, హిమబిందు, లక్ష్మి, చంద్రసేన, కుమారి, వెంకటసుబ్బమ్మ, హరి, మురగేష్, మణి, ప్రసాద్ తదితరులు ప్రధానంగా ఉన్నారు. కార్యక్రమంలో రేణిగుంట ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు సంధ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వడ్లతాంగల్ బాలాజీప్రసాద్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నగేషం, కో–ఆప్షన్ సభ్యుడు సుభాన్ రాజా, పార్టీ నాయకులు జువ్వల దయాకర్‌రెడ్డి, రహీం, ఎంపీటీసీ సభ్యులు శశికిరణ్, ఆనందరావు, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ పిల్లలకు ప్రోత్సాహకం



ఎస్పీ పరమేశ్వరరెడ్డి చేతులమీదుగా చెక్కు అందిస్తున్న దివాకర్‌రెడ్డి

తిరుపతి క్రైం: పదోతరగతిలో ప్రతిభను కనబరిచి ఉత్తమ మార్కులు సాధించిన పోలీసు కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. ఆదివారం తిరుపతిలోని ఓ ప్రైవేట్ కల్యాణమండపంలో డాలర్స్ గ్రూప్ అధినేత దివాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎస్పీ పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ చేతులమీదుగా 104 మంది విద్యార్థులకు రూ.10వేల చొప్పున మొత్తం రూ.10.4 లక్షల నగదును పంపిణీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత భవిష్యత్ సాధ్యమని వెల్లడించారు. ఇంతమంది పిల్లలను ప్రోత్సహించేందుకు నగదు అందించిన దివాకర్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ పోలీసులంటే తనకు ఎనలేని గౌరవమన్నారు. దేశం ప్రశాంతంగా ఉందంటే అది పోలీసుల వల్లే అని వివరించారు. అలాంటి పోలీసుల పిల్లలకు తన వంతు సాయం చేయడం బాధ్యతగా భావిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, విమల కుమారి పాల్గొన్నారు

శాస్త్రోక్తం.. సుళ్లు ఉత్సవం



సుడిమాను

సూళ్లూరుపేట : చెంగాళమ్మ పరమేశ్వరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు ఆదివారం వేలాది మంది భక్తుల సమక్షంలో శాస్త్రోక్తంగా సుళ్ల ఉత్సవం నిర్వహించారు. పూలమాలతో కూడిన వడిబాల, రుబ్బురోలు, నల్ల మేకపిల్ల, మనిషి బొమ్మను సుడిమానుకు కట్టారు. కోళ్లమిట్ట వాసులు సుడిమానును తిప్పి ఉత్సవానికి ముగింపు పలికారు. ముందుగా పూలమాలను అమ్మవారి వద్ద పూజలు చేసి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆలయ కమిటీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, పాలకమండలి సభ్యులు సుడిమాను చుట్టూ ఊరేగించారు. గంగపెట్టితో యాదవుల వీరతాళ్లతో చేసిన వీరనాట్యాలు ఆకట్టుకున్నాయి. రాత్రి అమ్మవారు నంది వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు.



సుడిమాను తిప్పుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజీవయ్య తదితరులు